జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం... ప్రజల కోసం
## సిద్దిపేట
ఆదివారం | 13 | సెప్టెంబర్ | 2026 | పేజీలు : 11

## గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణం లో జరగాలి

పోలీసుల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్




2 లో

## సురక్షిత సిద్దిపేటే లక్ష్యం

మహిళా భద్రత,

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

హెల్ప్ లైన్ నెంబర్ 112 పై

ప్రత్యేక అవగాహన కల్పించాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్

రష్మి పెరుమాళ్

2 లో






## వాల్టా చట్టానికి తూట్లు

అనుమతులు లేకుండా చెట్ల నరికివేత

అధికారుల నిర్లక్ష్యంపై

గ్రామస్తుల ఆగ్రహం

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 12, (ప్రజా జ్యోతి):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వాలు ప్రచారం చేయడం తప్ప, ఆచరణలో మాత్రం పట్టించుకోవడం లేదని మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామ ఉపసర్పంచ్ బాలకిషన్, వార్డు సభ్యులు పవన్,

మిగతా 2లో..

# రాజినే రాజమార్గం

13 ఏళ్ల ఏడబాటుకు తెర

లోక్ అధాలత్ తో

భార్యాభర్తల రాజీ

మండల న్యాయ సేవా సంస్థ

ఛైర్మన్, ప్రథమ శ్రేణి జూనియర్

సివిల్ జడ్జి మూల స్వాతి గౌడ్



**గజ్వేల్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):** రాజినే రాజమార్గం, రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరు పక్షాలకు న్యాయం జరుగుతుందని మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్, ప్రథమ శ్రేణి జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతి గౌడ్ అన్నారు. గజ్వేల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్ లో అదనపు జూనియర్ సివిల్

మిగతా 2లో..

# వాల్టా చట్టానికి తూట్లు

మొదటి పేజీ తరువాయి..

కిషన్ మండిపడ్డారు. గ్రామంలో అనుమతులు లేకుండా కలప వ్యాపారాలు నిర్వహిస్తూ, రహదారికి ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద చెట్లను అక్రమంగా నరికివేసి తరలించేందుకు ప్రయత్నిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ అక్రమంగా చెట్లను నరికివేస్తున్న విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా, సెలవు రోజున తనకు సంబంధం లేదంటూ దాటవేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని మండల పరిషత్ అధికారికి తెలిపినా స్పందన లేకపోయిందని వారు పేర్కొన్నారు. చెట్లను పరిరక్షించాల్సిన అధికారులే అక్రమాలకు పాల్పడుతున్న వారికి వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కలపను తరలిస్తున్న వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెట్ల నరికివేతను అడ్డుకుని, పర్యావరణ పరిరక్షణకు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మల్లేశంను ఫోన్ ద్వారా సంప్రదించగా, ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో ఈ వ్యవహారంపై అటవీ శాఖ అధికారుల స్పందన తెలియరాలేదు.

## సురక్షిత సిద్దిపేటే లక్ష్యం



సిద్దిపేట,సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి): ప్రజల్లో నమ్మకం పెంచేలా పోలీసింగ్ ఉండాలని, అందరూ కలిసికట్టుగా పనిచేసి 'సురక్షిత సిద్దిపేట' సాధనకు కృషి చేయాలని' సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ అన్నారు. శనివారం సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందితో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ శనివారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్కు వచ్చే, పిర్యాదుదారులు, బాధితులతో వ్యవహరించే తీరు, అవగాహన కార్యక్రమాలు, మహిళా రక్షణ చర్యలపై సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులు వారి కౌన్సెలర్లతో ఎంతో శాంతంగా, ఓర్పుతో మాట్లాడాలని సమస్యలను సమగ్రంగా విని, ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి సాధ్యమైనంత వరకు సమస్యలను సజావుగా పరిష్కరించేలా చొరవ చూపాలన్నారు. విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు నాణ్యమైన అవగాహన కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో క్రమం తప్పకుండా నిర్వహించాలని, ప్రస్తుత డిజిటల్ యుగంలో మహిళలు, యువతులు ఎదుర్కొంటున్న సైబర్ మార్ఫింగ్, సోషల్ మీడియా వేధింపులు ఆన్లైన్ మోసాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర సమయాల్లో 112 హెల్ప్లైన్ నంబర్ ప్రాముఖ్యత, మహిళా భద్రతా చట్టాలు పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. క్విక్ రెస్పాన్స్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు, ఉద్యోగినులకు ప్రాథమిక ఆత్మరక్షణ నైపుణ్యాలను నేర్పించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ప్రభావవంతమైన సమాజ అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళలపై జరిగే అరాచకాలను అరికట్టి, సమాజంలో సానుకూల సామాజిక మార్పును తీసుకురావడమే ధ్యేయం కావాలి అని తెలిపారు. ఈ సమావేశంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా, భరోసా సిబ్బంది మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి ఆశయ సాధనకు పోరాడాలి



చేర్యాల, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం సీపీఎం కార్యకర్తలు నిరంతరం పోరాడాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చేర్యాల సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో విద్య, వైద్యం ప్రైవేటీకరణతో పాటు ప్రభుత్వ ఆస్తులు, సంపదను కార్పొరేట్లకు అప్పగించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కార్మిక,కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, మండల కార్యదర్శి బండకింది అరుణ్కుమార్, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు పోలోజు శ్రీహరి, ఇప్పకాయల శోభ, భావండ్లపల్లి రమ, ఎర్రబోసు అశోక్, బోయిని మల్లేశం, ఆముదాల రంజిత్రెడ్డి, బొంగోని భాస్కర్, తుప్పతి రాజు, నంగి మైసయ్య, మెర్గోజు సత్యనారాయణ, రామచంద్రం, మహేష్, తుమ్మలపల్లి అనిల్, కొంగరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీనే రాజమార్గం



మొదటి పేజీ తరువాయి..

జడ్జి మన్వీర్తో కలిసి ఆమె మాట్లాడారు.లోక్ అదాలత్ లో అన్ని రకాల కేసులు కలిపి 2,020 కేసులకు పరిష్కారం లభించిందని న్యాయమూర్తి తెలిపారు.రాజి ద్వారా వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడం వల్ల సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెల కొంటాయాని పేర్కొన్నారు. పదమూడే ళ్లుగా కొనసాగిన కుటుంబ వివాదానికి రాజీ ద్వారా పరిష్కారం లభించడంతో ఇరు వర్గాల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పదమూడేళ్లుగా వేర్వేరుగా జీవిస్తున్న భార్యాభర్తలు లోక్ అదాలత్ చొరవతో తమ విభేదాలను పరిష్కరించుకుని ఒక్కటయ్యారు. దీంతో ఇన్నాళ్లుగా కొనసాగుతున్న కుటుంబ వివాదానికి సామరస్యపూర్వకంగా ముగింపు లభించింది. గజ్వేల్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్లో ఈ పరిష్కారం జరిగింది.అహ్మదీపూర్ గ్రామానికి చెందిన అండె లక్ష్మికి తొగుట మండలం లింగంపేట గ్రామానికి చెందిన అండె ఆంజనేయులుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో లక్ష్మి తల్లిదండ్రులు రూ.30 వేల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి ఆభరణాలతో పాటు గృహోపకరణాలను కట్నంగా అందజేశారు.




కొంతకాలం వారి సంసారం సజావుగానే సాగగా, వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.అనంతరం అదనపు కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్త లక్ష్మి, మామ ఈదయ్య, బావమరిది యాదయ్య, ఆడపడుచు ఎల్లవ్వ తదితరులు తనను శారీరకంగా, మానసికంగా వేధించారని లక్ష్మి ఆరోపించింది. కుటుంబ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆమెను ఇంటి నుంచి పంపించారని పేర్కొంది.దీంతో 2013 మే 14న లక్ష్మి గజ్వేల్ పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి భార్యాభర్తలు వేర్వేరుగా జీవిస్తున్నారు. పదమూడేళ్ల అనంతరం ఈ కేసు లోక్ అదాలత్ పరిధిలోకి రావడంతో న్యాయాధికారులు, ఇరువర్గాల పెద్దలు కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. పరస్పర అవగాహనతో విభేదాలను పరిష్కరించుకోవాలని సూచించడంతో భార్యాభర్తలు రాజీకి అంగీకరించారు.ఈ కార్యక్రమంలో ఏసిపి మాధవీలత, గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.కిరణ్ సాగర్ రావు, ఉపాధ్యక్షుడు నరేష్చారి, తొగుట సీఐ లతీఫ్, గజ్వేల్ సీఐ రవికుమార్, న్యాయవాది అశోక్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేధింపులు అరికట్టాలి..

### కనీస వేతనాలు అమలు చేయాలి



చేర్యాల, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి): పరిశ్రమల్లో మహిళా కార్మికులపై వేధింపులను అరికట్టి, కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం చేర్యాల మండలం అర్జున్పట్ల గ్రామ పరిధిలోని సింప్లి ఫ్రెష్ పరిశ్రమలో కార్మికులు విధులు బహిష్కరించి గేటు ఎదుట బైఠాయించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళా కార్మికులను వేధిస్తున్న సూపర్వైజర్ను తొలగించాలని, స్థానిక మహిళలను సూపర్వైజర్లుగా నియమించి పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, జీవో 6 ప్రకారం నైపుణ్యం లేని కార్మికులకు రూ.14 వేలు, పాక్షిక నైపుణ్యం ఉన్న వారికి రూ.15 వేలు, నైపుణ్యం కలిగిన వారికి రూ.16,500, ఉన్నత నైపుణ్యం కలిగిన వారికి రూ.18 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈఎస్ఐ, పీఎఫ్, జాతీయ, పండుగ సెలవులు, ఓటీకి డబుల్ వేతనం, వారాంతపు సెలవులు, వేతనంతో కూడిన సెలవులు తదితర చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, వేతన స్లిప్పులు, భద్రతా షూలు, యూనిఫాంలు అందించాలని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలపై పరిశ్రమ హెచ్ఆర్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన సుధాకర్రెడ్డి సూపర్వైజర్ను ఇప్పటికే తొలగించామని, వేతనాలు, ఇతర చట్టపరమైన సౌకర్యాల అమలుతో పాటు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణం లో జరగాలి

### పోలీసుల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్12(ప్రజాజ్యోతి):ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేలా నిర్వాహకులు, వాలంటీర్లు ఎల్లప్పుడూ పోలీసులతో సమన్వయం పాటిస్తూ సహకరించాలని, ప్రజలందరూ ఆధ్యాత్మిక వాతావరణంలో, శాంతియుతంగా ఉత్సవాలను జరుపుకోవాల ని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ పిలుపునిచ్చారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ శనివారం గణేష్ మండప నిర్వాహకులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలపై నిర్వాహకులకు పలు కీలక సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండప నిర్వాహకులు ముందుగానే గణేష్ మండపం వివరాలు, నిమజ్జనం తేదీ, శోభాయాత్ర రూట్ వివరాలను తెలంగాణ పోలీస్ పోర్టల్ ద్వారా కచ్చితంగా నమోదు చేసి సమాచారం అందించాలన్నారు. ఇంటిమేషన్ ఫారమ్స్ నమోదు చేయడం ద్వారా పోలీస్ బందోబస్తు, రూట్ ప్లానింగ్, ట్రాఫిక్ మేనేజ్మెంట్ సజావుగా నిర్వహించడానికి వీలవుతుందని తెలిపారు. ప్రతి గణేష్ మండపంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని ఖచ్చితంగా ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ వైర్ల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాహనాల్లో వినాయక విగ్రహాల ఊరేగింపు సమయంలో పైనున్న విద్యుత్ వైర్లు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మండపం వద్ద స్థానిక ఎస్ హెచ్ఓ , విద్యుత్ శాఖ, మున్సిపల్, ఫైర్ అధికారుల అత్యవసర సంప్రదింపు నంబర్ల బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు.మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదని, సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను, నకిలీ వార్తలను నమ్మవద్దని , ప్రచారం చేయవద్దని అన్నారు. ఇతరుల భావాలను, మత విశ్వాసాలను దెబ్బతీసే ఆక్షేపణీయమైన సంగీతం, పాటలు, స్లోగన్స్ వాడవద్దని సూచించారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ అదనపు డీసీపీ ఏ ఆర్ సుభాష్ చంద్రబోస్ , సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, ఏసిపిలు , సిఐలు, ఎస్ఐలు, గణేష్ మండపాల నిర్వాహకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలతో రైతన్న విలవిల

### 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి
### రాజగోపాలపేట, కొండం రాజు పల్లి
### సబ్‌స్టేషన్‌ల వద్ద రైతుల ధర్నా
### నంగునూరు-గట్ల మల్యాల-ఖాతా రహదారిపై రాస్తారోకో



నంగునూరు, సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి):విద్యుత్ కోతలపై అన్నదాతలు ఆగ్రహించారు. విద్యుత్ కోతలతో పంటలకు సాగునీటిని అందించడం ఇబ్బందిగా మారడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. సబ్ స్టేషన్లను ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. రహదారులను దిగ్బంధిస్తున్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం కొండంరాజుపల్లి, రాజగోపాలపేట విద్యుత్ సబ్ స్టేషన్లను శనివారం రైతులు ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన బాట పట్టారు. కరెంటు కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.గట్లమల్యాల, ఘనపూర్, ఖాతా, కొండంరాజుపల్లి, సంతోష్ నగర్ గ్రామాలకు చెందిన రైతులు కొండంరాజుపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని నినదించారు. ప్రస్తుతం విద్యుత్ కోతలు, సరఫరాలో అంతరాయాలతో సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు తెలిపారు. పంటలకు కీలకమైన సమయంలో విద్యుత్ అందక పోవడంతో బోర్లు, మోటార్లపై ఆధారపడిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యుత్ కోతల వల్ల పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నాలుగు కొండం రాజు పల్లి, ఖాత, గణపురం, గట్ల మల్యాల సర్పంచులు సర్పంచులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. విద్యుత్ లైన్ మెన్ పోతిరెడ్డి రాములు వినతి పత్రం అందించారు.



#### రాజగోపాలపేటలోనూ నిరసన

కరెంటు కోతలతో పంటలు ఎండి పోతున్నాయని ఆరోపిస్తూ రాజగోపాలపేట గ్రామ రైతులు ఆ గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందులను విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తొలగించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అవసరమైన మేరకు నిరంతరాయ విద్యుత్ అందించాలని కోరారు. రైతుల పొలాలకు నీరు అందాలంటే విద్యుత్ సరఫరా కీలకమని పేర్కొన్నారు. కరెంటు కోతలు కొనసాగితే సాగు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.



## అణగారిన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం



సిద్ధిపేట రూరల్,సెప్టెంబర్ 12,(ప్రజాజ్యోతి):క్షేత్రస్థాయి నుంచి ఆదివాసీ కాంగ్రెస్ నాయకత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు అణగారిన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని బండి శివకుమార్ అన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్లో భాగంగా తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జిల్లా కమిటీల నియామక ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు.ఆసిఫాబాద్, మంచిర్యాల, సిద్దిపేట జిల్లాల్లో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్ష పదవులతో పాటు జిల్లా, తాలూకా స్థాయి పదవులకు ఆసక్తి ఉన్న ఆదివాసీ నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లోని ఆదివాసీ నాయకులకు పార్టీ పదవుల నియామక ప్రక్రియ, అర్హతలు, దరఖాస్తు విధానంపై వివరించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బండి శివకుమార్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి ఆదివాసీ నాయకత్వాన్ని బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఆదివాసీలకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పిస్తూ వారి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఎస్టీలకు రిజర్వేషన్ల ద్వారా వివిధ రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీకి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కాంగ్రెస్ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, మహిళా అధ్యక్షురాలు ముద్దాం లక్ష్మి, కలిముద్దీన్, రూరల్ మండల అధ్యక్షుడు గారిపల్లి రాములు, రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ కోఆర్డినేటర్ గణేష్ రాథోడ్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొదాది రమేష్, ఎన్ఎస్యూఐ రూరల్ మండల అధ్యక్షుడు గ్యార రఘుపతి, సంయోదీన్, మహిపాల్ రెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



కొమురవెల్లి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):- మండలంలోని రసూలాబాద్ గ్రామంలో ఎస్సీ కాలనీ అభివృద్ధికి సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల అనూష స్వామి గౌడ్, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలోని పాలకవర్గం పీఆర్ఆర్ ఎస్ఎఫ్సీ నిధుల ద్వారా రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టింది.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వామి గౌడ్, వార్డు సభ్యులు మల్లేశం, శ్రీకాంత్, పరశురాములు, గ్రామ పెద్దలు అబ్దుల్లా, యాదయ్య, బాలరాజు, వెంకటేష్, భానుచందర్, శ్రీనివాస్, మల్లయ్య, మైపాల్, రాజు, నవీన్, సంతోష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, యువకులు కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### ఆర్ఐ కొండల్‌రెడ్డి



మిరుదొడ్డి, సెప్టెంబర్ 12, (ప్రజా జ్యోతి): గ్రామాల్లో ఓటరు సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐ కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఓటరు సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ తీరును బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాల్సిన బాధ్యత బీఎల్ఓలపై ఉందని ఆర్ఐ కొండల్రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, మృతులు, వలస వెళ్లినవారు, డూప్లికేట్ పేర్లను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల నుంచి వచ్చే అభ్యంతరాలు, మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో జీపీఓ కాశీతో పాటు బీఎల్ఓలు పున్నమ్మ, ప్రేమలత, రేణుక, బుజ్జమ్మ పాల్గొన్నారు.

# జామా మజీద్ కమిటీ అధ్యక్ష ఎన్నికపై గందరగోళం



### ఎవరికి వారే అధ్యక్షులని ప్రచారం
### ఎన్నికలు నిర్వారించాలని పెద్ద మనుషుల తీర్మానం

దుబ్బాక ప్రతినిధి , సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి): దుబ్బాక జామా మజీద్ కమిటీ అధ్యక్ష ఎన్నికపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలోని ముస్లిం సోదరుల జామా మజీద్ కమిటిక సంబందించి, ఇటీవలే పాత కమిటీ పదవి కాలం పూర్తయింది. ఈ క్రమంలో మజీద్ కమిటీ నూతన అధ్యక్షుని ఎన్నికకు సంబందించి సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి, ఎవరికి వారు ఇద్దరు అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శనివారం ప్రకటించుకోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. రెండు వర్గాలకు చెందిన నాయకులు తమకే అధిక సంఖ్యలో సభ్యులు మద్దతు ఉందని తెలియజేస్తున్నారు.దీంతో ఇరు వర్గాల మద్య గొడవలు తలెత్తే అవకాశం ఉండడంతో, కొంత మంది ముస్లిం సభ్యులు ఏలాంటి గొడవలు జరగకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించి, నూతన అధ్యక్షున్ని ఎన్నుకునేలా చర్యలు తీసుకోవాలని



శనివారం దుబ్బాక పోలీస్ స్టేషన్లో వినతి పత్రం సమర్పించారు.



## నాణ్యమైన కరెంటు ఇవ్వాల్సిందే

చిన్నకోడూరు, సెప్టెంబర్12, (ప్రజాజ్యోతి):వ్యవసాయానికి 24 గంటల పాటు కరెంటు అందించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ రహదారి మల్లారం స్టేజీ వద్ద రైతులు ధర్నాకు దిగారు.దీనితో వాహనాలు నిలిచిపోయాయి. ఓ వైపు వర్షాలు లేక మరో వైపు కరెంటు సక్రమంగా ఇవ్వకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.నిత్యం కరెంటు కోతలతో పంటలు పండే పరిస్థితి లేకుండా పోతుందన్నారు. ఖచ్చితంగా నాణ్యమైన కరెంటు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.రైతులకు మల్లారం సర్పంచ్ హరీష్,సికింద్లాపూర్ మాజీ సర్పంచ్ జయవర్ధన్ రెడ్డి,నాయకులు మేడికాయల వెంకటేశంతో పాటుగా బిఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు.

## కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై హర్షం



మిరుదొడ్డి, సెప్టెంబర్ 12, (ప్రజాజ్యోతి ): దుబ్బాక చేనేత వస్త్రాల ఎగుమతులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ తెలిపారు. చేనేత వస్త్రాల ఎగుమతుల కోసం ఆహర్నిశలు పాటుపడిన దుబ్బాక చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అంకం మదు ను శనివారం మిరుదొడ్డిలో పద్మశాలి సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు తయారుచేసిన దుబ్బాక చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందన్నారు. అలాగే చేనేత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు గడ్డం మధు, న్యాలపల్లి చంద్రమౌళి, కారంపూడి లచ్చయ్య, సుతారి వెంకటయ్య, ఆడెపు కుమార్, కొండ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి సాంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని

### పురోహితులు నందగిరి శ్యాంప్రసాద్ శర్మ



గజ్వేల్ సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):వినాయక చవితి వేడుకలను మన పూర్వీకులు అందించిన సాంప్రదాయ పద్ధతిలోనే నిర్వహించుకోవాలని ప్రముఖ గజ్వేల్ పురోహితులు నందగిరి శ్యాంప్రసాద్ శర్మ సూచించారు. శనివారం గజ్వేల్లో ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల వేళ భక్తులందరూ ఆధ్యాత్మిక భావనతో, పూర్తి భక్తిశ్రద్ధల తో గడపాలని కోరారు. నవరాత్రులలో ఎలాంటి ఆడంబరాలకు పోకుండా, కేవలం భజన కీర్తనలు, భక్తి పాటలతో మాత్రమే పూజా కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. నవరాత్రుల ముగింపులో నిర్వహించే వినాయక నిమజ్జన వేడుకలను సైతం ఎంతో పవిత్రమైన వాతావరణంలో, సాంప్రదాయ పద్ధతులకు లోబడి మాత్రమే జరపాలన్నారు. ఈ పావన పర్వదినాల్లో భక్తులంతా ఐక్యతతో, ఆధ్యాత్మిక చింతనతో గణనాథుని సేవలో తరించాలని ఆకాంక్షించారు.



## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఎం.డి. సయ్యద్

కొమురవెల్లి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):- మండలంలోని అయినాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎం.డి. సయ్యద్ సిద్దిపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ కె. హైమావతి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ఎం.డి. సయ్యద్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో ఉపాధ్యాయుడిగా తనదైన గుర్తింపు సాధించడంతో పాటు రచయితగా, కవిగా సామాజిక అంశాలపై అనేక కార్యక్రమాలు నిర్వహించినందుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థుల అభ్యున్నతికి, సమాజ సేవకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎం.డి. సయ్యద్కు అవార్డు లభించడం పట్ల గ్రామ సర్పంచ్ ఏర్పుల కళ్యాణి కృష్ణ, ఉపసర్పంచ్ మల్లం శ్రీనివాస్, గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగా శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు, కవి గాయకులు పిన్నింటి రత్నం తదితరులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ఆర్యవైశ్య భవన శంకుస్థాపనను విజయవంతం చేయాలి

### సిద్దిపేట జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలి
### సిద్దిపేట ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు గంప రవి గుప్త



దౌల్తాబాద్, సెప్టెంబర్ 12 ( ప్రజా జ్యోతి )తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్యుల చిరకాల ఆకాంక్ష అయిన ఆర్యవైశ్య భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిద్దిపేట ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు గంప రవి గుప్తా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గంప రవి గుప్తా మాట్లాడుతూ.. హైదరాబాద్లోని ఉప్పల్ బాగాయత్లో ఆర్యవైశ్య భవన నిర్మాణానికి ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించడం అభినందనీయ మన్నారు. ఈ నెల 13న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేతుల మీదుగా భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగనుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేం దుకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.సిద్దిపేట జిల్లా నుంచి ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్కు తరలివచ్చి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఆర్యవైశ్యుల ఐక్యతను చాటేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా, పట్టణ స్థాయిలోని సంఘాల నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, యువత, సభ్యులు సమన్వయంతో పనిచేసి అధిక సంఖ్యలో ప్రజలను తరలించాలని సూచించారు. శంకుస్థాపన కార్యక్రమంతో పాటు శ్రీనివాస కల్యాణం, ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు ఆధ్యాత్మికతతో పాటు ఆర్యవైశ్యుల మధ్య స్నేహభావం, ఐక్యత, ఆత్మీయతను మరింత పెంపొందించేలా ఉంటాయని పేర్కొన్నారు. భవిష్యత్లో ఆర్యవైశ్య భవనం సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందని గంప రవి గుప్తా అన్నారు. రాష్ట్రంలోని ఆర్యవైశ్యులందరికీ ఉపయోగపడేలా భవన నిర్మాణం జరగడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ చారిత్రక కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్యుల భాగస్వామ్యం స్పష్టంగా కనిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# క్రీడలు శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి కృషి చేస్తాయి



నంగునూరుసెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి):చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి.. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉంది. వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తా చాటుతారు అని నంగునూరు సర్పంచి మండల స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) కబడ్డీ పోటీల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులు అన్నారు.నంగునూరులో శుక్రవారం నాడు ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి గందె రాజమౌళి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.నంగునూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సనాదుల బాల పోచయ్య, నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, ఉప సర్పంచి కోల శ్రీధర్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గాడిపల్లి వెంకటలక్ష్మి, పోటీల బహుమతులకు విరాళం అందించిన పీఆర్టీయూ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు ఎర్ర పార్థసారథి, నంగునూరు ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు దుబ్బుడు రవీందర్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు.క్రీడా ప్రతిభను వెలికితీయాలి ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. గెలుపే లక్ష్యంగా కాకుండా క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనడం ముఖ్యమన్నారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు క్రీడల్లో మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కోరారు.

### విజేతలకు బహుమతులు

రోజంతా ఉత్సాహంగా సాగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులకు శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. క్రీడాకారులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించి నంగునూరు మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శారీరక విద్యా ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### మండల స్థాయి క్రీడల్లో విద్యార్థుల సత్తా

కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖోలో పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నంగునూరు మండల స్థాయి క్రీడా పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. శుక్రవారం నంగునూరులో నిర్వహించిన కబడ్డీ పోటీలతో




మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు ముగిశాయి. ఈ నెల ఒక్కో క్రీడను ఒక రోజు చొప్పున మూడు రోజులు నిర్వహించారు. ఈ నెల ఒకటవ తేదీని మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో ఖోఖో క్రీడా పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మగ్దుంపూర్ సర్పంచి పాకాల శ్రీనివాస్ ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ నెల రెండవ తేదీన వాలీబాల్ పోటీలను నర్మెట ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రారంభించారు. ఈ నెల మూడవ తేదీన జరగవలసిన మండల స్థాయి కబడ్డీ క్రీడా పోటీలు వర్షం కారణంగా వాయిదా పడ్డాయి. తిరిగి ఈ పోటీలను శుక్రవారం నంగునూరులో నిర్వహించారు. అన్ని విభాగాల్లో కలిపి ఖోఖో పోటీలో 33 జట్లు, వాలీ బాల్ పోటీలో 28 జట్లు, కబడ్డీ పోటీలో 33 జట్లు పాల్గొన్నాయి. మండల క్రీడా సమాఖ్య కార్యదర్శి, నంగునూరు ఉన్నత పాఠశాల శారీరక విద్యా సంచాలకుడు(ఫిజికల్ డైరెక్టర్- పీడీ) గందె రాజమౌళి ఆధ్వర్యంలో పీడీలు లలితాభవాని(పాలమాకుల), దర్శనాల రాజ్ కుమార్(గట్లమల్యాల), భాగ్యలక్ష్మి (నర్మెట) జ్యోతి(రాజగోపాలపేట), శారీరక విద్యా ఉపాధ్యాయులు(ఫిజికల్ విద్యా ఉపాధ్యాయులు- పీఈటీలు) తడకంటి రాజు(మగ్దుంపూర్), నరేశ్(టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి), కట్ట రమేశ్(బద్దిపడగ), శారద(కేజీబీవీ నర్మెట) ఈ క్రీడలను నిర్వహించారు.క్రీడలను పలు



పాఠశాలల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి.

జూనియర్ విభాగం

**కబడ్డీలో..** బాలుర విభాగంలో టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి ప్రథమ స్థానం, మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, గట్ల మల్యాల ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం పొందాయి.

**వాలీబాల్:** బాలుర విభాగంలో టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి ప్రథమ స్థానం, రాజగోపాలపేట ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో నర్మెట ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి ద్వితీయ స్థానం పొందాయి.

**ఖో-ఖో:** బాలుర విభాగంలో టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి ప్రథమ స్థానం, నర్మెట ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి ప్రథమ స్థానం, నంగునూరు ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం దక్కించుకున్నాయి.

సీనియర్ విభాగం

**కబడ్డీ:** బాలుర విభాగంలో నంగునూరు ఉన్నత ప్రథమ స్థానం, టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో కేజీబీవీ నర్మెట ప్రథమ స్థానం, రాజగోపాల్పేట ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం పొందాయి.

వాలీబాల్: బాలుర విభాగంలో టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి ప్రథమ స్థానం, రాజగోపాలపేట ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో నర్మెట ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, మగ్దుంపూర్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం పొందాయి.

**ఖో-ఖో:**బాలుర విభాగంలో గట్ల మల్యాల ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, నర్మెట ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో టీఎస్ఎంఎస్ అక్కెనపల్లి ప్రథమ స్థానం, నర్మెట ఉన్నత ద్వితీయ స్థానం పొందింది. మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులు, జట్లకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే తత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, మండల స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.



## రాష్ట్ర సర్పంచుల ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీగా గుర్రాల శ్రీనివాస్

దుబ్బాక, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి): రాష్ట్ర సర్పంచుల ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీగా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ నియమితులయ్యారు. శనివారం హైదరాబాద్ లకిడికాపూల్లోని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం కార్యాలయంలో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సౌదాని భూమన్న యాదవ్ గుర్రాల శ్రీనివాస్కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు కీలక బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సౌదాని భూమన్న యాదవ్కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రంలోని సర్పంచులను సమన్వయం చేసి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామ పంచాయతీల బలోపేతం, సర్పంచుల హక్కులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన నిధులు, అధికారాల సాధన కోసం సర్పంచులందరితో కలిసి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సర్పంచులు పాల్గొన్నారు.

# దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తున్న బిఆర్ఎస్

### దళితుల ఓట్లతో అధికారం.. హామీలతో మభ్యపెట్టి అన్యాయం చేశారని కాంగ్రెస్ నేతల ధ్వజం

గజ్వేల్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి): దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, హామీలతో మభ్యపెట్టి చివరకు వారి ఆత్మగౌరవాన్నే అవమానించే స్థాయికి బిఆర్ఎస్ రాజకీయాలు దిగజారాయని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్కగళ్ల కరుణాకర్, వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్, కాంగ్రెస్ నాయకుడు కర్రోళ్ల ప్రవీణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.దళిత ముఖ్యమంత్రి పేరుతో తెలంగాణలో దళితులను రాజకీయంగా మోసం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వారు ఆరోపించారు. దళితబంధు, దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలు ఇచ్చి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితుల సమస్యలను పరిష్కరించకుండా మాటలతో కాలయాపన చేశారన్నారు. నాయకత్వం ఏ బాటలో నడిస్తే కింది స్థాయి నాయకులు కూడా అదే బాటలో నడుస్తారని, అందుకే బీఆర్ఎస్ నేతల్లో దళితుల పట్ల చిన్నచూపు, అహంకార ధోరణి పెరిగిపోయిందని మండిపడ్డారు. దళితులు నడిచిన ప్రాంతాల్లో పసుపు నీళ్లు చల్లిన ఘటనలు చోటుచేసుకోవడం దళితులపై వివక్షకు, అగ్రకుల ఆధిపత్య మనస్తత్వానికి పరాకాష్ట అని విమర్శించారు .దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఘటనలపై బీఆర్ఎస్ అధిష్ఠానం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీలో కొనసాగుతున్న దళిత నాయ కులు, కార్యకర్తలు ఇకనైనా ఆత్మవిమర్శ చేసుకుని, దళితులను అవమానించే చర్యలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. దళితుల గౌరవాన్ని కాపాడలేని పార్టీలో కొనసాగడం కంటే బయటకు వచ్చి సామాజిక న్యాయం కోసం పోరాడటం మేలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ దళితులకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తోందని వారు పేర్కొన్నారు. జాతీయ స్థాయితో పాటు తెలంగాణలోనూ దళిత నాయకత్వానికి కీలక పదవులు కల్పించడం సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందనడానికి నిదర్శనమన్నారు. దళితులపై అవమానకరంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఏ చర్యనూ సహించబోమని, దళితులపై వివక్షకు పాల్పడే శక్తుల రాజకీయ అహంకారాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పోతగల రవి, జిల్లా కార్యదర్శి సొక్కం సురేష్, నాయకులు వీరేష్, గడ్డం నవీన్, అశోక్, మల్లేష్, సాయిలు, కోడకండ్ల బాలు తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ పాలన స్వర్ణయుగం

## వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి): కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ పరిపాలన కాలం స్వర్ణయుగమని పేర్కొన్నారు. వర్గల్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోయిని కుమార్, బీజేపీ వార్డు సభ్యురాలు లావణ్య నర్సింలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కనుకయ్యతో పాటు పలువురు శనివారం గజ్వేల్లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వంటేరు ప్రతాప్రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వంటేరు ప్రతాప్రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ ఫలాలను ప్రజల గడపగడపకు చేర్చిన ఘనత కేసీఆర్కు దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించడంలో విఫలమయ్యాయని వంటేరు ప్రతాప్రెడ్డి విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వర్గల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేలూరు వెంకటరెడ్డి, శేరిపల్లి గ్రామ సర్పంచ్ పావని మోహన్రెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు నాగరాజు, వర్గల్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## జడ్జి మన్వీర్ చేతుల మీదుగా భద్రాచల తలంబ్రాల పంపిణీ

**రామకోటి రామరాజు నిస్వార్థ రామభక్తి అభినందనీయం**

**ప్రిన్సిపాల్ హరిణి పవన్**



గజ్వేల్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి): భద్రాచల శ్రీ సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలు సమర్పించి లక్షలాది మంది భక్తులు తమ రామభక్తిని చాటుకున్నారని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు అన్నారు. ఈ మహత్కార్యంలో సరస్వతీ శిశు మందిర్ ఉపాధ్యాయులు కూడా భక్తిశ్రద్ధలతో భాగస్వాములయ్యారని తెలిపారు. భద్రాచల రామయ్య కల్యాణానికి సమర్పించిన ముత్యాల తలంబ్రాలను తిరిగి భక్తులకు అందించే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మన్వీర్ చేతుల మీదుగా భక్తులకు తలంబ్రాలను పంపిణీ చేశారు. తలంబ్రాలు అందుకున్న భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సరస్వతీ శిశు మందిర్ ప్రిన్సిపాల్ హరిణి పవన్ మాట్లాడుతూ భద్రాచల రామయ్య తలంబ్రాలు అత్యంత మహిమాన్వితమైనవని అన్నారు. భద్రాచల దేవస్థానానికి 100 కిలోల ముత్యాల తలంబ్రాలను రామకోటి రామరాజు అందించడం ఆయన నిస్వార్థ రామభక్తికి నిదర్శనమన్నారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో తలంబ్రాలను తీసుకువచ్చి భక్తులకు ఉచితంగా అందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, సరస్వతీ శిశు మందిర్ ఉపాధ్యాయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులు శ్రేష్టం - కౌన్సిలర్ గోలి మమతా సంతోష్

గజ్వేల్ సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రకృతిని కాపాడుకుంటూ పండుగలను జరుపుకోవడమే నిజమైన భక్తి అని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 2 వ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్ పిలుపునిచ్చారు. శనివారం వార్డు పరిధిలో కౌన్సిలర్ గోలి మమత సంతోష్ స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ( పి ఓ పి) తో తయారు చేసిన విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమై పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. మన పూర్వీకుల సంప్రదాయం ప్రకారం మట్టితో చేసిన వినాయకుడిని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని, నిమజ్జనం కూడా సులువుగా పర్యావరణానికి హాని కలగకుండా జరుగుతుందని వివరించారు. వార్డును పర్యావరణ హిత వార్డుగా తీర్చిదిద్దే లక్ష్యంతో, వార్డు ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ ఉచిత విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. భక్తులంతా మట్టి గణపతులనే ప్రతిష్టించి, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతి శ్రీనివాస్ వార్డు ప్రముఖులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమాలను ఉధృతం చేయడమే సీతారాం ఏచూరికి ఘనమైన నివాళి

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమాలను మరింత ఉధృతం చేయడమే సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరికి అందించే నిజమైన నివాళి అని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అన్నారు. సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాముని గోపాలస్వామి మాట్లాడుతూ చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితులైన ఏచూరి, జీవితాంతం పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేశారని తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో విద్యార్థిగా ఉన్న సమయంలోనే అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని సైతం ప్రశ్నించి తన పోరాట పటిమను చాటుకున్నారని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో పేద ప్రజల సమస్యలను అనేకసార్లు సభలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సిద్దిపేట అర్బన్ మండల కార్యదర్శి చొప్పరి రవికుమార్, సిద్దిపేట రూరల్ మండలం కార్యదర్శి మామిడాల కనకయ్య, జిల్లా కమిటీ సభ్యులు జాలిగాపు శిరీష నాయకులు చెప్యాల బాలమణి, బత్తుల అభిషేక్ బాన్, వంగ రవీందర్ రెడ్డి, చిట్కూరు సుధాకర్, స్వామి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కోసం రైతుల ధర్నా

### సంఘీభావం తెలిపిన పలు పార్టీలు

### 12 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్

కొండపాక, సెప్టెంబర్ 12: (ప్రజా జ్యోతి):వ్యవసాయానికి 12 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా, రాంపల్లి, దుద్దెడ గ్రామాలకు చెందిన రైతులు రాజీవ్ రహదారిపై దుద్దెడ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ సత్యంకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఈ సత్యం మాట్లాడుతూ డీఈతో మాట్లాడినట్లు తెలిపారు. ఆదివారం నుంచి పాత పద్ధతి ప్రకారం వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి నిర్ణీత సమయం మేరకు విద్యుత్ సరఫరా చేస్తున్నప్పటికీ తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు కీలక దశలో విద్యుత్ కోతల కారణంగా సాగునీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. వ్యవసాయ బావులు, బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు విద్యుత్ అంతరాయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.పగలు, రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా 12 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే రైతులతో కలిసి రాజీవ్ రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో ర్యాగాల్ల దుర్గయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు నీల సత్యం, దుద్దెడ సర్పంచ్ మిద్దె శివకుమార్, అంకిరెడ్డిపల్లి సర్పంచ్ గాలి బాలయ్యతో పాటు నాయకులు తేలు అశోక్, పిడిశెట్టి శ్రీనివాస్, రాసుల రంజిత్, గోనె శ్రీనివాస్, బాలాజీ, నీల వెంకటేష్, ఎలుక రాజిరెడ్డి, గజ్వేల్ కర్ణాకర్‌రెడ్డి, గంగుల వెంకటేష్, బట్ట వెంకటేష్, మిద్దె చంద్రమౌళి, మిట్టపల్లి రాజు, నీల హరీష్, గగిల్లాపురం సాయిబాబు, దుద్దెడ నరేష్గౌడ్, పల్లె యాదగిరితో పాటు ఐదు గ్రామాల రైతులు పాల్గొన్నారు.





## క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

### గజ్వేల్ డివిజన్ ట్రస్మా అధ్యక్షులు మనోజ్ కుమార్‌రెడ్డి

జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి): క్రీడల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు అని ట్రస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్ రెడ్డి, సిద్ధిపేట జిల్లా కార్యదర్శి ఇన్నారెడ్డి,గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు మనోజ్ కుమార్‌రెడ్డి తెలిపారు.శనివారం గజ్వేల్ డివిజన్ ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గజ్వేల్ డివిజన్ లోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కబడ్డీ, వాలీబాల్, కోకో తదితర క్రీడల్లో విద్యార్థులు హోరాహోరీగా తలపడుతూ ఆకట్టుకున్నారు.తమ జట్టు విజయం సాధించాలనే పట్టుదలతో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన అనంతరం విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిన్నారుల ఆటతీరును వీక్షించిన పలువురు ప్రేక్షకులు వారిని అభినందించారు. ఈ క్రీడా పోటీల్లో సుమారు 100 జట్లు పాల్గొన్నట్లు స్పోర్ట్స్ మీట్ నిర్వాహకులు ప్రభాకర్‌రెడ్డి, గజ్వేల్ డివిజన్ ట్రస్మా అధ్యక్షుడు మనోజ్కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారంతో స్పోర్ట్స్ మీట్ ముగియనుందని, సాయంత్రం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సిద్దిపేట జిల్లా కుమ్మరి సంఘం జిల్లా కమిటీ రద్దు

### ఈ నెల 20న నూతన జిల్లా కమిటీ ఎన్నిక



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్12(ప్రజాజ్యోతి):శనివారం సిద్దిపేటలో జరిగిన సిద్దిపేట జిల్లా కుమ్మరి సంఘం జిల్లా కమిటీ సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరై, ప్రస్తుత జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.అనంతరం ఈ నెల 20వ తేదీన నూతన జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సిద్దిపేట జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు ఈ వారంలోనే సమాచారం అందించాలని సూచించారు.అన్ని మండలాల నుంచి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన జిల్లా కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని కోరారు. కుమ్మరి సంఘం బలోపేతానికి, సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ ధరిపల్లి చంద్రం, కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమన్ కోల్ వీరేశం, రాష్ట్ర కార్యదర్శి నాగపురి నగేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎరిగిచెట్టి వీరయ్య, మాజీ బోనాల కమిటీ చైర్మన్ రమన్ కోల్ ప్రభాకర్, తరిగొప్పుల రామచంద్రం, నాగపురి రమేష్, ధరిపల్లి శ్రీనివాస్, ధరిపల్లి నగేష్, ఆంజనేయులు, మోడీపల్లి భూమయ్య, వరకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి

### సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్



కొమురవెల్లి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి): సీపీఎం పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా కొమురవెల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.సీతారాం ఏచూరి తన జీవితాన్ని ప్రజా పోరాటాలకు అంకితం చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకుడని రవీందర్ అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదలు, విద్యార్థులు, యువత హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని తెలిపారు. పార్లమెంట్లో ప్రజల గొంతుకగా నిలుస్తూనే దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

#### మతతత్వ రాజకీయాలను ఓడించాలి

దేశంలో మతతత్వ శక్తులు బలపడుతున్న సమయంలో సీతారాం ఏచూరి లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం రాజీలేని పోరాటం చేశారని రవీందర్ గుర్తుచేశారు. మతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల మధ్య చీలికలు సృష్టించే రాజకీయాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. మతతత్వ రాజకీయాలను ఓడించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు సామాన్య ప్రజలపై తీవ్ర భారాన్ని మోపుతున్నాయని రవీందర్ విమర్శించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల సమస్యలు, కార్మిక హక్కులపై దాడులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రజా సంక్షేమ రంగాల బలహీనత వంటి సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ప్రజల అసలు సమస్యలపై సమాధానం చెప్పాల్సిన పాలకులు మతం, కులం, ప్రాంతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలను ఆశ్రయించడం ప్రమాదకరమని పేర్కొన్నారు. మతతత్వ రాజకీయాలు దేశ ఐక్యతకు, లౌకిక ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని అన్నారు.

#### నాయకుల నివాళి

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు, తడకపల్లి శ్రీనివాస్, నాయకులు సార్ల యాదయ్య, కర్రోళ్ల రాకేష్, మల్కని కనకయ్య, గాంధారి శ్రావణ్ చారి, నూకల శ్రీనివాస్, పుట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం




సిద్దిపేట, సెప్టెంబర్ 12,(ప్రజాజ్యోతి):సమయం, వనరులు వృథా కాకుండా లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సుదర్శన్ అన్నారు. లోక్ అదాలత్లో ఇరువర్గాలు రాజీకి ముందుకు రావడం ద్వారా సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడంతో పాటు పరస్పర సంబంధాలు మెరుగుపడతాయన్నారు.శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసులను ఇరువర్గాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీ ద్వారా వన్టైమ్ సెటిల్మెంట్తో సమస్యకు ముగింపు పలకవచ్చని తెలిపారు.లోక్ అదాలత్ సందర్భంగా కేసుల పరిష్కారంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ, ఉపాధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దివ్యాంగజన్ కౌశల్ వికాస్, దివ్యాంగజన్ రోజ్గార్ సేతు కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల సంక్షేమం, పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ చేపట్టినట్లు తెలిపారు.గ్రామీణ అభివృద్ధి శాఖ, ఆర్సెటీ ఆధ్వర్యంలో శిక్షణ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఎంప్లాయ్మెంట్ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సమర్థనం ట్రస్ట్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, వేదాస్ సొల్యూషన్స్, మెడిప్లేస్, ఆర్సెటీ సంస్థలు పాల్గొని మేళాకు




హాజరైన 175 మంది దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 30 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు జిల్లా జడ్జి తెలిపారు. లీడ్ బ్యాంక్ ద్వారా అర్హులకు రుణ సదుపాయం పొందే అవకాశాన్ని కూడా కల్పించినట్లు వెల్లడించారు.అనంతరం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామీణ అభివృద్ధి శాఖ, సంక్షేమ శాఖ, ఉపాధి కల్పన శాఖ, లీడ్ బ్యాంక్ స్టాళ్లను జిల్లా జడ్జి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి జయప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్బాబు, న్యాయవాదులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సింధం శేషికాంత్ నియామకం

రాయపోల్ సెప్టెంబర్ 12: సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం రాయపోల్ మండల్ అంకిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ సింధం శేషికాంత్ గారినీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గార్ల ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఈ రోజు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సొదాని భూమన్న యాదవ్ గారు నియమించి నియామక పత్రాన్ని హైదరాబాదులో లక్డికాపూల్ సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సింధం శేషికాంత్ గారు తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం రాష్ట్ర కమిటీతో కలిసి తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గారిని కలిసి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా సింధం శేషికాంత్ గారు మాట్లాడుతూ తనకు ఈ కీలక బాధ్యత అప్పగించిన తెలంగాణ రాష్ట్ర మంత్రులకు మరియు రాష్ట్ర సర్పంచుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు సొదాని భూమన్న యాదవ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రంలోని సర్పంచులను సమన్వయం చేసుకుని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.గ్రామ పంచాయతీల బలోపేతం, సర్పంచుల హక్కులు మరియు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన నిధులు మరియు అధికారాల సాధన కోసం సర్పంచులందరితో కలిసి పనిచేస్తానని సిద్ధం శశికాంత్ గారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని సర్పంచులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి సమస్యల పరిష్కారానికి ముందుకు సాగేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ల ఫోరం కార్యవర్గం పాల్గొనడం జరిగింది.

# పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా చేయాలి

### బిఆర్ఎస్ పార్టీ తొగుట మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

### విద్యుత్ కోతలను నిరసిస్తూ తుక్కాపూర్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

తొగుట, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి): పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా చేయాలని చేయాలని బిఆర్ఎస్ పార్టీ తొగుట మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలను నిరసిస్తూ బిఆర్ఎస్ శ్రేణులు తుక్కాపూర్ సబ్టేషన్ వద్ద శనివారం ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్పు కావాలని ఓట్లు వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతును మళ్లీ కరెంటు కోసం రోడ్డెక్కించే పరిస్థితి తెచ్చిందని, బిఆర్ఎస్ హాయంలో పంటలు ఎండిపోకుండా నిరంతర కరెంటు సప్లై చేశారని, నేడు రోజుకు 10 గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందక పోవడంతో రైతుల మోటార్లు పనిచేయడం లేదని, పొలాల్లో నీళ్ల లేక పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లకు కరెంటు లేదని, పొలాల్లో నీళ్ల లేక పంటలు ఎండి పోతున్నాయన్నారు. రైతు పంటను కాపాడటంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం పసుపు నీళ్లపై విచారణ చేయడం దౌర్భాగ్యం అన్నారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మసాగర్ ప్రాజెక్టుల్లోకి నీటిని ఎత్తిపోయక పోవడంతో కాలువల ద్వారా పంట పొలాలకు నీరు అందక, రైతులు బోరు మోటార్లపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. అలాంటి సమయంలో విద్యుత్ కోతలు విధిస్తే రైతు పంటను ఎలా కాపాడుకోవాలని





ప్రశ్నించారు. మార్పు తెచ్చామని చెప్పుకుంటున్న రేవంత్ ప్రభుత్వం రైతుకు మాత్రం రోజుకు 10 గంటల కరెంటు కూడా ఇవ్వలేకపోతోందని సొసైటీ చైర్మన్ కె హరికృష్ణా రెడ్డి విమర్శించారు. నాడు 24 గంటల కరెంటు ఇచ్చిన తెలంగాణలో నేడు కరెంటు కోసం ఎడ్ల బండితో రోడ్డెక్కే పరిస్థితి రావడమేనా ఈ మార్పుఅని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాపై రైతులు ఏఈ శ్రీధర్ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటలకు అత్యవసరమైన సమయంలో కోతలు విధించడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. కనీసం 20 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఏఈ శ్రీధర్కు వినతిపత్రం సమర్పించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యుత్ సరఫరాను మెరుగు పరచాలని, లేకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఆందోళన లో సర్పంచ్ లు బక్క కనకయ్య, కోల వెంకటస్వామి, పార్టీ నాయకులు చిలువేరి మల్లారెడ్డి, బోధనం కనకయ్య, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, వేల్పుల స్వామి, చంద స్వామి, సుతారి రమేష్, పరమేశ్వర్ రెడ్డి, మంగ నర్సింలు, ఎల్లం, నరేందర్ గౌడ్, బోయిని శ్రీనివాస్, నేవూరి కర్ణాకర్ రెడ్డి, రాజయ్య, రమేష్, కనకయ్య, లక్ష్మారెడ్డి, కర్ణాకర్, సంతోష్ రెడ్డి, పర్శరాములు, శ్రీధర్,ఈశ్వర్, వెంకట్ రెడ్డి, కర్ణాకర్, రాజశేఖర్, పైర పర్శయ్య, కమలాకర్, శ్రీనివాస్, భాస్కర్, యాదగిరి, మధుసూదన్ రెడ్డి, కిషన్, భూమయ్య, బిక్షపతి, పర్శరాములు, వెంకటయ్య, రాంబాబు, రమేష్, బాలరాజుతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

### 16 వ వార్డు కౌన్సిలర్ దేవుని రాజు



దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి): ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్ల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు స్వీకరించి ఆరోగ్యంగా ఉండాలని 16 వ వార్డు కౌన్సిలర్ దేవుని రాజు అన్నారు. పోషణ మాసం సందర్భంగా శనివారం నాడు 16 వ వార్డులోని అంగన్వాడీ సెంటర్లో గర్భిణీలు మహిళలతో కలిసి పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాజు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు, శిశువులకు పౌష్టికరమైన, బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుందని అన్నారు. ప్రతినిత్యం భోజనంలో గుడ్డును తీసుకోవడం ద్వారా పోషకాహార సమతుల్యత ఏర్పడుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ప్రకటించాలి

## రేషన్ డీలర్ల రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు



సిద్దిపేట, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి): రేషన్ డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం ప్రకటించాలని రేషన్ డీలర్ల రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు కోరారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా రేషన్ డీలర్ల సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని నాయకోటి రాజు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గౌరవ వేతనం అందించాలన్నారు. అలాగే రేషన్ డీలర్లకు రెండో కమిషన్ కింద రూ.300 కమిషన్ చెల్లించాలని కోరారు. గతంలో కార్పొరేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న సుమారు రూ.100 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని కోరారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభమై సుమారు 18 నెలలు గడిచినా దొడ్డిబియ్యాన్ని రేషన్ దుకాణాల్లోనే నిల్వ ఉంచి డీలర్లకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం అందుబాటులో లేని సమయంలోనూ డీలర్ల నుంచి రూ.22 చెల్లించాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. డీలర్లపై కేసులు పెడతామని బెదిరించే అధికారులు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమాలు చేపడతామని నాయకోటి రాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, వీరేశం, వినయ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏచూరి సీతారాం వర్ధంతి వేడుకలు

**చిత్రపటానికి పూలమాలలు వేసి**

**నివాళులర్పించిన సిపిఎం నాయకులు**

**మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి**

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్**



దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి): లౌకిక ప్రజాస్వామ్య భారత రాజ్యాంగ విలువలను కాపాడేందుకు మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి ఏచూరి సీతారాం అని సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు జి భాస్కర్ అన్నారు. శనివారం రోజున దుబ్బాకలో సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గారి రెండవ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్ మాట్లాడుతూ.... ఏచూరి లౌకిక, ప్రజాస్వామిక ,భారత రాజ్యాంగ విలువలను కాపాడేందుకు మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు.ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని రక్షించాలని కార్మికులు,రైతులు,పేదలు అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాకుడన్నారు.ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడిగా, మార్క్సిస్టు సిద్ధాంతవేత్తగా దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకున్నారని ప్రజా సమస్యలపై పదునైన వాదన, ప్రజా ఉద్యమాల పట్ల నిబద్ధత ఆయన రాజకీయ జీవితానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని గుర్తు చేశారు.ఢిల్లీ జె.ఎన్.యు యూనివర్సిటీలో విద్యార్థి సంఘానికి రెండు దఫాలు అధ్యక్షుడిగా ఎన్నికయి అక్కడ అనేక పోరాటాలకు నాయకత్వం వహిస్తూ విద్యార్థుల సమస్యల పై నాటి ప్రధాని ఇందిరాగాంధీని నిలదీసిన నాయకుడన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం దుబ్బాక పట్టణ కార్యదర్శి కొంపల్లి భాస్కర్, నాయకులు ఎండి సాజిద్, చెట్టి శ్రీనివాస్, యాదగిరి, మారుతి,కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

# ఎకో ఫ్రెండ్లీ గణేశా

## జీఎంఆర్ పాఠశాలలో మట్టి వినాయకుల పంపిణీ



సిద్దిపేట,సెప్టెంబర్ 12,(ప్రజాజ్యోతి):పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు రసాయనాలతో తయారయ్యే వినాయక విగ్రహాల వల్ల కలిగే కాలుష్యాన్ని నివారించేందుకు మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని జీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సందేశమిచ్చారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావిస్తూ పాఠశాల ఆధ్వర్యంలో 'ఎకో ఫ్రెండ్లీ గణేశా' కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల ప్రాధాన్యతను వివరిస్తూ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు.



కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ.. సమాజంలో ఇప్పటికే అనేక విద్యాసంస్థలు ఉన్న నేపథ్యంలో తమ పాఠశాల ద్వారా సమాజానికి ఒక విన్యూత్నమైన, ఉపయోగకరమైన సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రసాయనాలు, ఇతర హానికర పదార్థాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలను చెరువులు, నదులు, ఇతర నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణానికి హాని కలగకుండా గణేశ్ ఉత్సవాలను నిర్వహించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ అతిర , డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. సిద్దిపేట వన్టౌన్ ఎస్ఐ మురళీధర్, ట్రాఫిక్ ఏఎస్ఐ అశోక్తో పాటు ఇతర శాఖల సిబ్బంది పాల్గొని విద్యార్థుల చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.



# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా జ్యోతి ఎంపిక

## హర్షం వ్యక్తం చేసిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం

దుబ్బాక, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి): ఉపాధ్యాయ వృత్తి అత్యంత ఉన్నతమైనటువంటి వృత్తి అని, భావి సమాజాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు వారి సేవలను గుర్తించి సన్మానించుకోవడం హర్షణీయమని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ హైమవతి అన్నారు. సిద్దిపే





టలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా లచ్చపేట మోడల్ స్కూల్ కు చెందిన పి.జీ.టి. కెమిస్ట్రీ బోధకురాలు కె. జ్యోతి ఎంపికయ్యారు. ఈ మేరకు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, కలెక్టర్, డి.ఈ.ఓ. చేతుల మీదుగా ఆమె జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంచేలా సులువైన పద్ధతుల్లో ప్రత్యక్ష విధానం ద్వారా విద్యార్థులకు బోధించడం అభినందించదగ్గ విషయమన్నారు. అంతే కాకుండా విద్యార్థులను వివిధ పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేస్తున్న ఉపాధ్యాయురాలు సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా స్టాండింగ్ కోఆర్డినేటర్ రామస్వామి, డిసిపి చైర్మన్ చక్రపాణి డిఎస్ఓ రాజమౌళి, దుబ్బాక ఎం.ఈ.ఓ. ప్రభుదాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

# యాదవ ఉద్యోగుల సేవలు అభినందనీయం

సిద్దిపేట,సెప్టెంబర్ 12, (ప్రజా జ్యోతి) : యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందిస్తున్న యాదవ ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్లో యాదవ ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షులు బైరి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న ఉల్లి సమ్మయ్య యాదవ్, కట్టా భిక్షపతి యాదవ్, పయ్యావుల జయపాల్ యాదవ్, భారతీ యాదవ్, తెల్జీరు స్వాతి యాదవ్, మేడుదుల పోచయ్య యాదవ్, కనకచంద్రం యాదవ్, శ్రీశైలం యాదవ్, దాసరి రాజు యాదవ్లను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్, జిల్లా అధ్యక్షులు మామిండ్ల ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవ ఉద్యోగులు అందిస్తున్న సేవలను అభినందించారు. ఉద్యోగులు తమ వృత్తిపరమైన బాధ్యతలతో పాటు సమాజ సేవలోనూ ముందుండాలని సూచించారు.కవి,



రచయిత ఉండ్రాళ్ల రాజేశం యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ సేవలను సమాజ అభ్యున్నతికి వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో సందబోయిన రాజు యాదవ్, కాల్వ రాజయ్య యాదవ్, తలారి చంద్రశేఖర్ యాదవ్, బొల్లు రామ్, తెల్జీరు శ్రీనివాస్ యాదవ్, బాల్ నర్సయ్య, మల్లయ్య యాదవ్, రమేష్, ఐలయ్య, రాజు, సత్యలక్ష్మి, తిరుపతి, బాలమల్లు, నర్సింలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్లకు వెసులుబాట్లు కల్పించాలి




## ప్రభుత్వానికి సహకరిస్తాం

## రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం కార్యదర్శి మోహన్‌రెడ్డి

సిద్ధిపేట,సెప్టెంబర్ 12,(ప్రజాజ్యోతి):రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్రంలోని వివిధ జిల్లాల రైస్ మిల్లర్ల ప్రతినిధులు కోరారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ప్రభుత్వం, మిల్లర్లు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. ధాన్యం నిల్వలకు అవసరమైన స్థలం, మిల్లింగ్కు గడువు, ప్రభుత్వ నిబంధనల విషయంలో వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు.శనివారం సిద్దిపేట పట్టణంలో రాష్ట్ర రైస్ మిల్లర్ల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల రైస్ మిల్లర్ల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు పెద్ద సంఖ్యలో మిల్లర్లు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు.రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం కార్యదర్శి మోహన్రెడ్డి మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా రైస్ మిల్లర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లేం దుకు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు.రైతుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకూడదన్నదే మిల్లర్ల ఉద్దేశమని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియలో ఎక్కడైనా అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటే ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించేందుకు మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.గతంలో ప్రభుత్వం మిల్లర్లకు కొన్ని వెసులుబాట్లు కల్పించిందని, ప్రస్తుతం కూడా మిల్లర్ల వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 75 లక్షల టన్నుల ధాన్యం మిల్లింగ్ చేయాల్సి ఉండగా, దానిని నిల్వ చేసేందుకు భారీ స్థాయిలో స్థలం అవసరమవుతోందన్నారు.మిల్లింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు డిసెంబర్ వరకు గడువు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ప్రభుత్వం, రైస్ మిల్లర్లు పరస్పరం చర్చించుకుని స్పష్టమైన ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ధాన్యం సరఫరా, మిల్లింగ్ ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న తొమ్మిది రోజుల పాటు రోజుకో కార్యక్రమం నిర్వహించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు.



# దరిపల్లి చంద్రంకు సన్మానం

సిద్దిపేట, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర శాలివాహన కుమ్మరి సంఘం రాష్ట్ర నాయకులు, కార్యవర్గ సభ్యులు సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రంను శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. చైర్మన్గా జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి, విద్యార్థులు, యువతకు మెరుగైన పఠన వాతావరణం కల్పించేందుకు కృషి చేయాలని ఆకాంక్షిం చారు. అలాగే సంఘం సమస్యలు, సామాజిక అభివృద్ధి, యువతకు విద్యా రంగంలో ప్రోత్సాహం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమన్కోల్ వీరేశం, రాష్ట్ర కార్యదర్శి నాగపురి నగేష్, ప్రచార కార్యదర్శి ఎరిగిచెట్టి వీరయ్య, మాజీ బోనాల కమిటీ చైర్మన్ రమన్కోల్ ప్రభాకర్, తరిగొప్పుల రామచంద్రం, నాగపురి రమేష్, ధర్పల్లి శ్రీనివాస్, ధర్పల్లి నగేష్, మోడీపల్లి భూమయ్య, వరకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.





# విద్యుత్ కోతకు నిరసనగా రైతుల రాస్తారోకో



నారాయణరావుపేట, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి): ప్రభుత్వం రైతులకు 24 గంటల కరంటు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని, విద్యుత్ కోత తో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళనకు దిగారు. శనివా రం నారాయణరావుపేట మండలం జక్కాపూర్, గోపులాపూర్ రైతులు, బీఆర్ఎస్ నాయకులు సిరిసిల్ల మెయిన్ రోడ్డుపై ధర్నా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి నిరంతరాయం గా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటం, నాణ్యమైన విద్యుత్ అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించి సక్రమంగా విద్యుత్ అందించాలన్నారు. అనంతరం రైతులు విద్యుత్ శాఖ అధికారులకు తమ సమస్యలను వివరించి, 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ మెమొ రండం సమర్పించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతుల తరపున మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ ధర్నాలో పలువురు రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా శశికాంత్



రాయపోల్, సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర సర్పం చుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాయపోలు మండలం అంకిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ సింధం శశికాంత్ నియమితుల య్యారు. హైదరాబా దులో ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సౌధాని భూమన్న యాదవ్ నియామక పత్రాన్ని అందజేసి,అనంతరం మంత్రి సీతక్కని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధం శశికాంత్ మాట్లాడుతూ సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అరిగే సుధాకర్

### డిజిటల్ విద్యలో వినూత్న ఆవిష్కరణలు

చేర్యాల,సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి) : గురువు అనే విద్యార్థులకు తరగతి గదిలో పాఠాలే కాదు జీవితంలో ఎదిగేందుకు పాఠాలను బోధిస్తూ వారికి జీవితమంటే ఏమిటి అని బోధించేవారు. అలాంటి కోవాకు చెందిన ఉపాధ్యాయులు అరిగే సుధాకర్. కష్టాలతో సాహసం చేసి, ఎంతో ఇష్టపడి భౌతిక శాస్త్రం చదివి ఆ చదువును నలుగురికి పంచాలని ఉద్దేశంతో ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకొని కాలంతో పోటీ పడుతూ ఎప్పటికప్పుడు ప్రపంచ ఆధునిక టెక్నాలజీని అవగాహన చేసుకుని విద్యార్థులకు బోధిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేరుస్తున్నారు. సుధాకర్ మొదటగా తన ఉపాధ్యాయ వృత్తిని మరుమాముల గ్రామంలో మొదలుపెట్టి అనంతరం నర్సా యిపల్లి,ముస్త్యాల, సలఖ్ పూర్,ప్రస్తుతం తాడూరు గ్రామ పాఠశాలలో విద్యాబోధనలు చేస్తున్నారు.

### డిజిటల్ విద్యలో వినూత్న ఆవిష్కరణలు

సిమ్యులేషన్స్ తో కూడిన ఫిజికల్ సైన్స్ డిజిటల్ బ్లాక్ విద్యార్థులకు భౌతిక శాస్త్రంలోని క్లిష్టమైన అంశాలు సులభంగా, స్పష్టంగా, ఆసక్తికరంగా అనుభవపూర్వకంగా అర్థమయ్యేలా సుధాకర్ వివిధ భౌతిక శాస్త్ర అంశాలకు సంబంధించిన ఇంటరాక్టివ్ సిమ్యులేషన్స్తో కూడిన డిజిటల్ బ్లాక్ను అభివృద్ధి చేశారు.తాను రూపొందించిన ఈ డిజిటల్ వనరును ఇతర భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం జిల్లాలోని పలువురు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఈ సిమ్యులేషన్స్ను తమ బోధనలో ఉపయోగిస్తున్నారు. తన ఆవిష్కరణలో భాగంగా స్టూడెంట్ అటెండెన్స్ యాప్ రూపొందించి విద్యార్థుల యొక్క హాజరు శాతాన్ని, విద్యా విధానాన్ని తల్లిదండ్రులకు తెలిసేలా యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు సమాచారాన్ని అందిస్తున్నారు. పర్యావరణహిత ఆవిష్కరణలో



భాగంగా యాప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో విద్యార్థులకు విద్యాబోధనలు చేస్తూ కాగితాల వినియోగాన్ని తగ్గించారు. నూతన టెక్నాలజీ లో భాగంగా ఏఐ ఆధారిత విద్యా విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన సామాగ్రిని వినియోగించి, ఇంటరాక్టివ్ కంటెంట్ తయారు చేసి కొత్త సిమ్యులేషన్స్ వంటి కార్యక్రమాలు చేశారు. సుధాకర్ చేస్తున్న సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు.శుక్రవారం రోజు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా అధికారులు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ స్వస్థలమైన వీరన్నపేట గ్రామస్తులు, తను చదువు చెప్తున్నా తాడూరు గ్రామ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మండలంలోని పలువురు విద్యావేత్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## నిధులు తేరు కానీ నిందలు వేస్తారా

### కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

### బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుండవెల్లి ఎల్లారెడ్డి

### దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు ఇల్లందుల శ్రీనివాస్



దుబ్బాక, సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కనీస విషయాన్ని కూడా మర్చి స్థానిక ఎమ్మెల్యే పై నిందలు వేస్తూ నిధులు తీసుకురాకుండా అనవసర విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకులకు సిగ్గుచేటని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు గుండవెల్లి ఎల్లారెడ్డి, దుబ్బాక మున్సిపల్ అధ్యక్షులు ఇల్లందుల శ్రీనివాస్ అన్నారు. నిధులు తెచ్చే సత్తాలేక కొంతమంది చిల్లర నాయకులతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై నిందలు వేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నాడు దుబ్బాకలోని శివాజీ చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి దుబ్బాకకు రూపాయి తెచ్చిన దాఖలాలు లేవని, కాంగ్రెస్ సర్కార్ ఇస్తానన్న 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పెలా అవుతుందన్నారు. 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి కేవలం 7 గంటల ఇవ్వడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎమ్మెల్యే పై కత్తిపోటు కేసు విచారణ కోర్టు పరిధిలో ఉందన్నారు. ఆ విషయం కూడా తెలియని స్థితిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి దిగజారుడు రాజకీయాలను మానుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతలు రాక్షస ప్రవృత్తిని మార్చుకోకపోతే త్వరలోనే వారికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బాణాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు రాజమౌళి, కిషన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు వనం రమేష్, నందాల శ్రీకాంత్, బడుగు రాజు, బండి శ్రీలేఖ, ఎండీ. చాంద్ మియా, దేవుని రాజు, కో ఆప్షన్ మెంబర్లు, మాజీ కౌన్సిలర్లు స్వామి, లలిత, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లన్న సన్నిధిలో యాదవుల పెద్దపట్నం

సిద్ధిపేట,సెప్టెంబర్ 12,(ప్రజాజ్యోతి):కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో ఆదివారం నిర్వహించనున్న పెద్దపట్నం కార్యక్రమానికి యాదవ సమాజ పెద్దలు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మామిళ్ల ఐలయ్య యాదవ్ కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ 21 వరుసలతో 100 మంది కలిసి పెద్దపట్నం నిర్వహించనున్నట్లు తెలిపారు.శనివారం సిద్దిపేటలోని వేములవాడ కమాన్ సమీపంలో నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాదవ మహాసభ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదివారం కొమురవెల్లి మల్లన్న ఆలయ సన్నిధిలో చేపట్టనున్న పెద్దపట్నం కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఎనిమిదేళ్ల క్రితం ఇదే నందీశ్వరుడిని దర్శించుకుని కొమురవెల్లి మల్లన్న ఆలయం వరకు పాదయాత్ర చేపట్టినట్లు యాదవ నాయకుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ గుర్తుచేశారు. అప్పట్లో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని, తెలంగాణ పచ్చని పంటలతో, జలాశయాలతో సస్యశ్యామలంగా ఉండాలని మల్లన్నను వేడుకున్నామని తెలిపారు. అలాగే కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు.తమ మొక్కును మల్లన్న స్వీకరించి కోరుకున్న కోరికలను నెరవేర్చాడని శ్రీహరి యాదవ్ పేర్కొన్నారు. మల్లన్నపై ఉన్న అదే నమ్మకంతో మరోసారి నందీశ్వరుడిని పూజించి, ఆదివారం స్వామివారి సన్నిధిలో పెద్దపట్నం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మల్లన్న కరుణాకటాక్షాలతో తమ ఆకాంక్షలు నెరవేరుతాయనే విశ్వాసం ఉందన్నారు.యాదవ సమాజ ఐక్యతను చాటేలా నిర్వహించనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో యాదవ పెద్దలు, యువత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు గంధం రాజు యాదవ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బొల్లు రాము యాదవ్, చింతల యాదగిరి యాదవ్, బీనబోయిన కృష్ణ యాదవ్, నల్ల వెంకటేశం యాదవ్, కొండవేని రాజు యాదవ్, రాజబోయిన బాలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 36 సంవత్సరాలుగా దైవ సేవలో శ్రీ వెంకటేశ్వర భజన మండలి

చేర్యాల సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి): ఆకునూరు గ్రామానికి చెందిన శ్రీ వెంకటేశ్వర భజన మండలి గత 36 సంవత్సరాలుగా నిరంతరం దేవుని సేవలో భజనలు చేస్తూ భక్తులను పరవశింప చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆకునూరు గ్రామంలో శనివారం భజన, ఏకాదశి భజన, సోమవారం భజన వంటి కార్యక్రమాలను రామాలయం, శివాలయం వేదికగా నిర్వహిస్తున్నా రు. ఈ శ్రావణమాసంలో గత నెల రోజులుగా నిరంతరంగా భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ శ్రావణమాసం ముగింపు సందర్భంగా గ్రామ కళ్యాణార్థం, లోక కళ్యాణార్థం 12 గంటల భజన కార్యక్రమాన్ని శనివారం రోజు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకునూరు గ్రామంతో పాటు చేర్యాల, బచ్చన్నపేట నర్సాయపల్లి, గాగిల్లాపూర్, రాంపూర్, మర్మాముల,బైరాన్ పల్లి, జాలపల్లి, కొత్త దొమ్మాట గ్రామల భజన మండలితోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

